క్లుప్తంగా

కార్మికుడి మృతికి నేతల నివాళి



నివాళి అర్పిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న బాలాపూర్‌కు చెందిన అంజరాజు మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేయర్ చిగురింతపారిజాతరెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైహింద్, బండారు మనోహర్‌లు మృతదేహానికి నివాళులు అర్పించారు. రాజు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

డీసీపీని కలిసిన కార్పొరేటర్



డీసీపీని సన్మానిస్తున్న కార్పొరేటర్ దీపికశేఖర్‌రెడ్డి

బడంగ్‌పేట్: ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీని శాలువతో సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో వినాయకహిల్స్ కాలనీవాసులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి

జల్‌పల్లి కమిషనర్ వాణి రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ వాణి రెడ్డి

పహాడీషరీఫ్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఐ ఓటు ఫర్ ష్యూర్ అనే నినాదంతో జల్‌పల్లి మున్సిపాలిటీలోని మరాఠ భవన్లో మంగళవారం ఓటర్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వాణి రెడ్డి మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంప్‌లు కూడా అన్ని నిర్మించడం జరిగిందన్నారు. ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌రాము, మెప్మా ఏవో జ్ఞానేశ్వర్, డీఎంసీ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ భువనగిరి సేవాదళ్ ఇన్‌చార్జిగా దాసు

ఇబ్రహీంపట్నం రూరల్: పీసీసీ సేవాదళ్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మంకాల దాసును నియమించారు. ఈ మేరకు మంగళవారం సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌కి చెందిన మంకాల దాసు కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన సేవలు గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఇబ్రహీంపట్నం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, సీనియర్ నేత మల్‌రెడ్డి రాంరెడ్డికి దాసు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోండి

ఎంఈఓకు బీజేపీ నేతల వినతి

యాచారం: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని.. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు మంగళవారం మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూల్ చేస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. వెంటనే తనిఖీలు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: మామిడిపల్లి దాసాంజనేయస్వామి ఆలయానికి రంగులు



కందుకూరు: తిమ్మాపూర్‌లో ముస్తాబైన రామాలయం

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

- ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు
- నేడు తిమ్మాపూర్‌కు రానున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పహాడీషరీఫ్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని నిర్వాహకులు ఆలయాలను ముస్తాబు చేశారు. రాములోరి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జల్‌పల్లిలోని శివ రామాంజనేయ స్వామి ఆలయం, శ్రీరాం కాలనీలోని సీతారామస్వామి దేవాలయం, అభయాంజనేయస్వామి ఆలయం, మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, దాసాంజనేయ స్వామి దేవాలయాలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాలలో శుభ్రత పనులు ఇప్పటికే పూర్తికాగా, మంగళవారం సాయంత్రం నుంచే ఆలయ ఆవరణలలో టెంట్లు వేయడం ప్రారంభించారు. కల్యాణమనంతరం అన్నదాన కార్యక్రమాలకు కూడా ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఇప్పటికే నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించిన పహాడీషరీఫ్, బాలాపూర్ పోలీసులు బుధవారం ఆలయాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.



కందుకూరు: నేదునూరులో..

కొత్తరూపుతో దేవాలయం

మామిడిపల్లి గ్రామంలోని ప్రాచీనమైన దాసాంజనేయ దేవాలయం ఈ ఏడాది కొత్తరూపును సంతరించుకుంది. పురాతనమైన ఈ ఆలయానికి గ్రామస్తుడు ఎడ్ల కృష్ణారెడ్డి సొంత నిధులతో దశావతరాలు, ప్రాకారం నిర్మించడంతో పాటు ఇతర మరమ్మతులు పూర్తి చేశారు. ఆలయానికి పూర్తిగా రంగులు వేయించడంతో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపేందుకు గ్రామ భక్తులు సిద్ధమయ్యారు.

విద్యుద్దీపాలతో అలంకరణ

కందుకూరు: శ్రీరామ నవమి ఉత్సవాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని దేవాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం మధ్యాహ్నం సీతారాముల కల్యాణోత్సవాన్ని కందుకూరు, కొత్తూర్, సాయిరెడ్డిగూడ, దెబ్బడగూడ, అన్నోజిగూడ, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, నేదునూరు, దాసర్లపల్లి, పులిమామిడి, చిప్పలపల్లి, కొత్తగూడ, కొత్తూర్, గూడూరు, రాచులూరు, లేమూరు, అగర్‌మియాగూడ, సరస్వతిగూడ, బేగంపేట, గుమ్మడవెల్లి, మాదాపూర్, తిమ్మాపూర్, ఆకులమైలారం, ధన్నారం, బాచుపల్లి, జైత్వారం తదితర గ్రామాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. దేవాలయాలకు ర ంగులు వేసి విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించే పనులు చేపట్టారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. తిమ్మాపూర్‌లోని రామాలయంలో నిర్వహించే శ్రీరామ నవమి ఉత్సవాలకు కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆయనే స్వయంగా స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

క్యామ పరామర్శ

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ పరామర్శించారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణారెడ్డిని మంగళవారం క్యామ పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా పరిషత్ చైర్మన్ సందీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండికి చెందిన భీమానాయక్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ మంగళవారం ఉదయం భీమానాయక్ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.5వేలు సాయం అందించారు. అలాగే మాజీ సర్పంచ్ తులసీరాంనాయక్ రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఉప సర్పంచ్ శారద, నాయకులు హర్యానాయక్, గోపాల్, శ్రీను, చత్రు, శ్రీను, రాజా తదితరులు ఉన్నారు.

గురుకుల కళాశాలలో ఆరోగ్య శిబిరం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ శివారులోని నూర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న బాలికల గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ జయప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఉన్న 302 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు చేసి, అవసమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా, శ్వేత, స్టాఫ్‌నర్స్ దీపిక తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

- భారత్ జోడో అభియాన్ నాయకుడు శ్రీహరి ముదిరాజ్
- మండల కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశం



ఫ్లెక్సీని చూపుతున్న భారత్ జోడో అభియాన్ నాయకులు

మహేశ్వరం: భారత రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని మహేశ్వరం నియోజకవర్గ భారత్ జోడో అభియాన్ నాయకుడు కటికెల శ్రీహరి ముదిరాజ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సొంతంగా 400 ఎంపీ సీట్లు గెలుస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని కేంద్ర మంత్రులు, నేతలు పదేపదే చెబుతున్న మాటలను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో బీజేపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చే శక్తుల కుట్రలను ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలన్నారు. అణగారిన వర్గాల జీవితాలకు చదువును ఇచ్చి అగ్రవర్ణాల దోపిడీ నుంచి జ్యోతిరావు పూలే కాపాడారన్నారు. పూలేను ఆదర్శం చేసుకొని తన గురువుగా ప్రకటించుకున్న బీఆర్.అంబేడ్కర్ దేశానికి రాజ్యాంగాన్ని రచించి అందించారన్నారు. భారత రాజ్యాంగం మార్చే కుట్రలను బీజేపీ మానుకోవాలని హెచ్చరించారు. అంతకు ముందు మండల కేంద్రంలో ప్రచారం చేసి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, తిరుపతి, పెద్దనర్సింహ, జంగయ్య, సుభాష్, శ్రీకాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుడాకాంప్లెక్స్: గత పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాల దోపిడీ పాలనతో ప్రజలు విసిగిపోయారని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. సరూర్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి వారు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ ఇచ్చిన ఉచిత బస్ ప్రయాణం, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, యువ వికాసం హామీలను ప్రజలను గుర్తించాలని తెలిపారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నిజాముద్దీన్, పారిజాతనర్సింహారెడ్డి, జంగారెడ్డి, శంకర్‌యాదవ్, అరుణ, బాలకిషన్, ధన్‌రాజ్‌గౌడ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి రానివ్వొద్దు

మండల ప్రత్యేకాధికారి సంజయ్‌కుమార్

యాచారం: ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలకు నీటిఎద్దడి రాకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులతో ఆయన సమావేశమై మాట్లాడుతూ... నీటిఎద్దడిపై గ్రామాల ప్రత్యేకాధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరగడం, మిషన్ భగీరథ నీళ్లు కూడా తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీటి ట్యాంకుల శుభ్రతపై నిర్లక్ష్యం వద్దని అన్నారు. నీటి ఎద్దడిని వెంటనే గుర్తించి అవసరమైతే గ్రామాల సమీపాల్లోని వ్యవసాయ బోరుబావులను లీజ్‌కు తీసుకుని ప్రజలకు నీటి సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రాజు, ప్రియాంక, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీపీల ద్వారా పరిష్కరించండి..

మంచాల: గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వొద్దని ఎంపీడీఓ బాలశంకర్, మండల ప్రత్యేకాధికారి శాంతిశ్రీ అన్నారు. మంగళవారం మంచాల మండల కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ ద్వారా పరిష్కరించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ వెంకట ప్రసాద్, ఎంపీఓ తేజ్‌సింగ్, వివిధ గ్రామాలకు చెందిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మికతతో మానవుడి మనుగడకు మానసిక ప్రశాంతత లభిస్తుందని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరితతిరుపతయ్యలు అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో రెండురోజులుగా బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెండోరోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొని పూజలు చేశారు. అనంతరం టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌లు వారిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడు తూ.. గ్రామాల్లో ఉత్సవాలను కులమతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కలిసి ఉత్సవాలు జరుపుకున్నప్పుడే ఆనందాన్ని ఇస్తాయని తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నాయకులు గౌరీ రవి, శ్రీకాంత్, మల్లేశ్, బాల్‌రాజ్, భీమయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు మానయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



మాజీ సర్పంచ్‌లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి అన్నారు. మండలంలోని దామరగిద్ద, ఊరెళ్ల గ్రామాల మాజీ సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, జాహంగీర్, సింగప్పగూడ సీనియర్ నాయకుడు అలీ మంగళవారం చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావా లని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వసంతం, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధుర జ్ఞాపకాలను నెమరేసుకొని



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

- ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కందుకూరు: మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాలలో 1997–98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 26 సంవత్సరాల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలోనే మళ్లీ కలుసుకోవడంతో అలనాటి మధుర జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను మరోమారు నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, ప్రభాకర్‌రావు, లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, వెంకటేశం, కిషన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రమాదేవి తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జనార్దన్, వెంకటేష్, గోవర్దన్, గణేష్, రాంచంద్రయ్య, జహంగీర్ పాషా, సతీష్, యాదయ్య, అమరేందర్‌రెడ్డి, వెంకటేష్, రాము, మల్లేశ్, పర్వతాలు, చక్రపాణి, జంగయ్య, శేఖర్, రమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, కల్పన, నీలిమా, కవిత, స్రవంతి, ధనలక్ష్మీ, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

షాబాద్: కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో గల బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. దేవాలయంలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గ్రామం నుంచి దేవాలయం వరకు కలిపే రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, మల్లేశ్, నాయకులు సుభాష్, చెన్నయ్య, నర్సింలు, రవీందర్ తదితరులున్నారు.